

ఇద్దరు దొంగల అరెస్టు
వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు కరడుగట్టిన దొంగలను పోలీసులు పట్టుకున్నారు.

-8లో



సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలకు వేళాయె..!
తొలి అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1ను ఈ నెల 11వతేదీ నుంచి క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్‌ను విధానంలో నిర్వహించనున్నారు.

-8లో

గరిష్టం/కనిష్టం
36.0/25.6

వాతావరణం
జిల్లాలో గురువారం 25.6 - 36.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలో పలు మండలాల్లో వర్షం
కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో గురువారం తెల్లవారుజామున పలు మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో భాగంగా ఒంటిమిట్టలో అత్యధికంగా 70.8 మి.మీ కురిసింది. అలాగే అట్లూరులో 48.2 , గోపవరంలో 40, పెండ్లిమర్రిలో 28.4, చక్రాయపేటలో 20.4, సిద్దవటంలో 10.2, బద్వేల్‌లో 12.2, బి. కోడూరులో 6.2, బిమఠంలో 4.8 , ప్రొద్దుటూరులో 5, రాజుపాలెంలో 3.4, కమలాపురంలో 2.6, కడప, వీఎన్‌పల్లిలలో 2.2 , వేములలో 2 చెన్నూరు, తొండూరులలో 1.2 మి.మీ వర్షపాతం నమోదయింది. ఈ వర్షంతో వరినాట్లతోపాటు ఆరుతడి పంటలకు కొంత మేలు జరగనుంది.

సెలవు రోజుల్లో పాఠశాలలు నిర్వహించకూడదు
కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల వారు ప్రభుత్వ సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించకూడదని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. నిబంధలకు వ్యతిరేకంగా ఎవరైనా ఎలాంటి తరగతులు, ప్రత్యేక తరగతులు నిర్వహించకూడదని చెప్పారు. జిల్లాలోని డిప్యూటీ ఈఓలు, మండల విద్యాశాఖ అధికారులు వారి పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలలు ఈ ఉత్తర్వులు పాటించేలా చూడాలని.. పర్యవేక్షించాలని డీఈఓ షేక్ షంషుద్దీన్ ఆదేశించారు.

11వ తేదీ నుంచి అనుమతి లేని ప్లే స్కూల్స్ తెరవకూడదు...
జిల్లావ్యాప్తంగా 11వ తేదీ సోమవారం నుంచి అనుమతులు పొందని ప్లేస్కూల్స్ తెరవకూడదు, తరగతులను నిర్వహించకూడదని ఆయా యాజమాన్యాలకు డీఈఓ షేక్ షంషుద్దీన్ సూచించారు. ఈ ఉత్తర్వులు ఉల్లంఘించిన పాఠశాలలపై తగు చర్యలు తీసుకుంటామని డీఈఓ హెచ్చరించారు.

యూరియాను అధిక ధరకు అమ్మితే చర్యలు



జిల్లాకు వచ్చిన యూరియాను పరిశీలిస్తున్న జేడీఏ చంద్రానాయక్

కడప అగ్రికల్చర్: జిల్లాలో ఎరువుల డీలర్లు ఎవరైనా యూరియాను అధిక ధరలకు అమ్మితే చర్యలు కఠినంగా ఉంటాయని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రమైన కడప రైల్వేస్టేషన్‌కు వచ్చిన యూరియా రాక్‌ను జేడీఏ కార్యాలయ టెక్నికల్ ఏవో గోవర్ధన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాకు 1335 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. ఇందులో వైఎస్సార్‌జిల్లాకు 870 మెట్రిక్ టన్నులు రాగా ఇందులో 400 మెట్రిక్ టన్నులను మార్క్‌ఫెడ్‌కు కేటాయించామన్నారు. మిగతా 470 మెట్రిక్ టన్నులను ప్రైవేటు డీలర్లకు కేటాయించామన్నారు. అలాగే అన్నమయ్య జిల్లాకు 465 టన్నులు రాగా ఇందులో 265 టన్నులను మార్క్‌ఫెడ్‌కు, మిగతా 200 టన్నులను ప్రైవేటు డీలర్లు కేటాయించామని తెలిపారు. ఎవరైనా డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బరి తెగించారు!

పచ్చ సైకోలు ఊరిమీద పడ్డారు. బరిలోకి దిగి ఓటర్ల మనసులు గెలవాల్సింది పోయి అధికారదర్పాన్ని ఒళ్లంతా పూసుకుని బరితెగిస్తున్నారు. ప్రత్యర్థులపై రాళ్లూరప్పలు విసురుతున్నారు. కర్రలు..రాడ్లతో దాడులకు తెగబడుతున్నారు. పెట్రోల్ క్యాన్లు పట్టుకుని తిరుగుతూ పల్లెల్లో భయోత్పాతం సృష్టిస్తున్నారు. ఇదంతా చేసేది ఒక్క జెడ్పీటీసీ సీటు కోసమే. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న 'ముఖ్య'నేతల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ నేతలు వీరంగం చేస్తున్నారు. 'ఆపరేషన్ పులివెందుల' అంటూ పల్లెల్ని రణరంగంగా మారుస్తున్నారు.



ఆపరేషన్ పులివెందుల..
- ఉప ఎన్నికల్లో గెలుపు కోసం పచ్చ నేతల అరాచక ప్లానింగ్
- పోలింగ్ రోజు పూర్తిగా టీడీపీ కంట్రోల్‌లో ఉండాలనే తపన
- ఆమేరకు అన్ని ప్రయత్నాలు చేస్తున్న బీటెక్ రవి, ఎమ్మెల్యే ఆది
- చోద్యం చూస్తున్న పోలీస్ శాఖ

సాక్షి టాస్క్‌ఫోర్స్: జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలి. ఎంత అరాచకమైనా సరే, ఎన్ని కేసులైనా పర్వాలేదు. 'ఆపరేషన్ పులివెందుల'లో టీడీపీ జెండా ఎగరాలి.. టీడీపీ అధిష్టానం నుంచి వచ్చిన మార్గదర్శకాలివి. దీనికనుగుణంగానే క్షేత్రస్థాయిలో చర్యలుంటున్నాయి. టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి, కూటమి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కుట్రలు, కుయుక్తులు పక్కాగా అమలు చేస్తున్నారు. ఎన్నికల రోజు పోలింగ్ ఏజెంట్లు కూడా కూర్చొకూడదనే దిశగా పథకరచన చేస్తున్నారు. ఆమేరకు వరుసగా వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేస్తూ పచ్చని పల్లెల్లో ప్రత్యక్ష భయానక వాతావరణం సృష్టిస్తున్నారు.

- పులివెందులలో 30ఏళ్ల క్రితం ఇలాంటి సంస్కృతి ఉండేది. 20ఏళ్లుగా పట్టణ ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారు. తాజా ఉప ఎన్నికలు ఒక్కమారుగా భయానక వాతావరణం తీసుకొచ్చాయి. వ్యవస్థలు చేష్టలుడిగి కూర్చుండిపోవడమే అందుకు ప్రధాన కారణంగా విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మొన్న అ కారణంగా హత్యాయత్నం ఘటన ఉత్పన్నమైంది. 24 గంటలు గడవకముందే ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిపై హత్యాయత్నం ఘటన చోటుచేసుకుంది. ఇంత జరిగినా పోలీసులు కేసు నమోదుకు మాత్రమే పరిమితమయ్యారు. మరోవైపు నిందితులు మరికొంతమందిని టార్గెట్ చేసి కొడతామంటూ యథేచ్ఛగా తిరుగుతున్నారు. ప్రచారం ఉన్న ప్రాంతాలకు మాత్రమే బందోబస్తు కేటాయిస్తున్న పోలీసు అధికారులు.. దుండగుల కట్టడికి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

చెప్పినట్లు వింటారా... మీకు అదే గతి కావాలా?!
పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నేతలకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. చెప్పినట్లు వింటారా...మీకు అలాంటి గతి పట్టించాలా?అంటూ పలువురికి ఫోన్లు చేస్తున్నట్లు సమాచారం. అంటే ఏస్థాయికి బరితెగించారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి దుశ్చర్యలన్నీ కూడా కేవలం పోలింగ్ రోజు ఏకపక్ష పోలింగ్ కోసమేనని పలువురు వెల్లడిస్తున్నారు. పులివెందులలో టీడీపీ బలంతో పోలిస్తే వైఎస్సార్‌సీపీ బలం గణనీయంగా ఉంది. అయినప్పటికీ టీడీపీ నేతలు యథేచ్ఛగా దాడులు తెరపైకి తీసుకొస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారు.

త్రిముఖ వ్యూహం..


అధికారం ఉంది, ప్రతి చర్యలుండవు అనే ధీమా తెలుగుదేశం పార్టీ నేతల్లో బలంగా ఉంది. వెరసి తరచూ హత్యాయత్నం ఘటనలు తెరపైకి వస్తున్నాయి. ఈక్రమంలో ముందుగా నాయకుల్ని భయభ్రాంతులకు గురిచేయడం, తర్వాత ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బులు పంచడం, ఆ తర్వాత అధికారుల ద్వారా ఏకపక్ష పోలింగ్ నిర్వహించడం. అప్పటికీ గెలుపు అంచనాకు రాకుంటే విచ్చలవిడి హింసకు పాల్పడడం తోనైనా గట్టెక్కాలనే దిశగా టీడీపీ అడుగులు వేస్తోంది. ఆమేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రణాళికలు రచించినట్లు పలువురు వెల్లడిస్తున్నారు.

ఎల్లో గ్యాంగ్ హల్‌చల్....
వరుసగా హత్యాయత్నం ఘటనలకు పాల్పడిన తెలుగుదేశం మూకలు గురువారం సైతం పులివెందులలో యథేచ్ఛగా సంచరించారు. వాహనాల్లో మారణాయుధాలు వెంటబెట్టుకొని వాహన శ్రేణితో హల్‌చల్ చేశారు. టార్గెట్ నిర్ణయించిన వ్యక్తుల కోసం అన్వేషించినట్లు సమాచారం. పట్టణంలోని ఓ యూట్యూబర్, మరో ఇద్దరు వేముల మండల నాయకుల కోసం విశేషంగా అన్వేషణ చేసినట్లు తెలుస్తోంది. పోలీసుల అధికారుల కళ్ల ముందే అటు ఇటు తచ్చాడుతున్నా కట్టడి చేయాలనే ఆలోచన వారికి ఏమాత్రం కన్పించలేదు. కాగా, ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏకంగా దిశా-నిర్దేశం చేస్తూ ఎల్లో గ్యాంగ్‌ను మరింతగా ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. కొంతమంది అధికారులు, తెలుగు తమ్ముళ్లు, బీజేపీ నేతలు సంయుక్తంగా అడ్డదారుల్లోనైనా సరే, పులివెందుల గడ్డపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేయాలనే ఉత్సాహాన్ని అధికంగా కనబరుస్తున్నట్లు విశ్లేషకులు వివరిస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు ఈనెల 12న జరగనున్న ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్'హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పులివెందులలో జరిగిన దాడులు, అల్లర్ల సంఘటనలపై సమగ్రంగా విచారిస్తున్నామన్నారు. సంఘటనలకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలను తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచార సమయంలోనూ ఆ ప్రాంతానికి చెందిన వారు కాకుండా ఇతరులకు అనుమతి లేదన్నారు. పులివెందుల జెడ్పీటీసీ స్థానంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నిక జరిగేందుకు దాదాపు 600 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని కేటాయించామన్నారు.

'గండికోట' కేసులో టెక్నికల్‌గా విచారణ
గండికోటలో జరిగిన మైనర్‌బాలిక హత్య కేసులో ఇంకా టెక్నికల్‌గా ఆధారాలపై సమగ్రంగా విచారణ చేస్తున్నామని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలియజేశారు. త్వరలోనే ఈ కేసును ఛేదిస్తామని వెల్లడించారు.

గండిలో ట్రాఫిక్ ఆంక్షలు
చక్రాయపేట: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా మూడవ శనివారం రోజు వాహనాలను ఎట్టి పరిస్థితిలోను గండిలోకి అనుమతించే ప్రసక్తి లేదని ఆర్కే వ్యాలీ ఎస్సై రంగారావు తెలిపారు.శ్రావణ మాసం మూడవ శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ ఆంక్షలు పెట్టినట్లు ఆయన వివరించారు. ఉదయం 5గంటల నుంచే ట్రాఫిక్ ఆంక్షలు అమలులోకి వస్తాయని చెప్పారు. సాయంత్రం భక్తుల రద్దీని బట్టి ఆంక్షలను సడలిస్తామని చెప్పారు.

ఒకటే గమనం.. గెలుపే గమ్యం



నాయకులతో సమాలోచనలు చేస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- జెడ్పీటీసీ ఉప ఎన్నికలో విజయంపై వైఎస్సార్‌సీపీ వ్యూహ రచన
- నేతలకు దిశానిర్దేశం చేసిన ఆ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- ఒంటిమిట్టలో నాయకులతో విస్తృతంగా చర్చలు
- మరోవైపు జోరుగా ప్రచారం

సాక్షి రాయచోటి: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట ఆధ్యాత్మిక కేంద్రంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేసేందుకు ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దిశానిర్దేశం చేశారు. ఒకపక్క ప్రచారంతోపాటు మరోపక్క ఓటు బ్యాంకు ఉన్న నేతలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ఇప్పటికే దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ నేతలకు.. విజయ బావుటా ఎగురవేసేందుకు అవసరమైన వ్యూహాన్ని వివరించారు. ప్రస్తుత రోజులతోపాటు ఎన్నికల ముందు అనుసరించాల్సిన విధానాన్ని వివరించడంతోపాటు సమష్టిగా పని చేస్తూ.. ఒక పథకం ప్రకానం ముందుకు వెళితే విజయం తథ్యమని వివరిస్తూ వచ్చారు. కార్యకర్తలు, నాయకులు, నేతలు, శ్రేణులు ఒంటిమిట్ట వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని గెలిపించి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని సూచించారు. ఒంటిమిట్టలో జెడ్పీటీసీ అభ్యర్థి సుబ్బారెడ్డి అతిథి గృహం వద్ద రాష్ట్ర రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి నేతలతో చర్చించడంతోపాటు సమీక్షించి విజయానికి వ్యూహం రచించారు.

కొత్త మాధవరంలో ముమ్మరంగా ప్రచారం
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఒంటిమిట్ట జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి మద్దతుగా పెద్ద ఎత్తున నేతలు వచ్చి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రధానంగా గురువారం రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, రాజంపేట పార్లమెంట్ పరిశీలకులు, కడప మేయర్ సురేష్ బాబు, కడప పార్లమెంటు పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

భయపెట్టి గెలుస్తామనుకోవడం మూర్ఖత్వమే

ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

పులివెందుల: భయపెట్టి గెలుస్తామనుకోవడం టీడీపీ నేతల మూర్ఖత్వమే అవుతుందని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఇది మంచి సాంప్రదాయం కాదని మండిపడ్డారు. 30ఏళ్ల క్రితం పులివెందులలో ఫ్యాక్షన్ గొడవలు ఉండేవని.. ప్రస్తుతం అవన్నీ లేవన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఓ వైపు అరటి, మరో వైపు మిరప, చీనీ పంటలతో పులివెందుల కోస్తాను తలపిస్తోందని.. ఇక్కడి రైతులందరూ విభేధాలను వదిలిపెట్టేసి సంతోషంగా ఉన్నారన్నారు. పిల్లలను మంచి చదువులు చదివిస్తూ ఆనందంగా జీవిస్తున్నారన్నారు. ఇలాంటి నేపథ్యంలో గతంలో మరిచిపోయిన ఆ విష సంస్కృతిని తీసుకొచ్చే విధంగా కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. కాగా పోలీసులు సైతం రాజకీయనాయకుల్లా ప్రవర్తించడం బాధాకరమన్నారు. డిపార్ట్‌మెంట్‌లో ఉన్నప్పుడు కచ్చితంగా రెండువైపులా బ్యాలెన్స్ చేసుకుంటూ పోవాలే గానీ.. సున్నితమైన పులివెందుల లాంటి ప్రాంతంలో సాధ్యమైతే, చేతనైతే ఎటువంటి గొడవలు లేకుండా చూడాలే తప్ప, గతంలో నాలుగు వేసినారు ఇప్పుడు రెండుకు రెండే కదా వేసేదంటూ మాట్లాడటం డిపార్ట్‌మెంట్ ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీయడమేనన్నారు. శాంతి భద్రతల కోసం పటిష్ట చర్యలు చేపట్టాల్సింది పోయి పత్తేపారం అంటూ డీఐజీ లాంటి వ్యక్తి మాట్లాడడం సరికాదన్నారు.

వరాల పండుగకు వేళాయె!



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



అరటి పిలకలు కొంటున్న యువకుడు

- నేడు వరలక్ష్మీవ్రతం
- ఆలయాలు, ఇళ్లల్లో విశేష పూజలు

కడప సెవెన్‌రోడ్స్: మహిళలు తమ సౌభాగ్యం కోసం ప్రార్థించే పండుగల్లో శ్రీ వరలక్ష్మీమాత వ్రతం ముఖ్యమైనది. శుక్రవారం పండుగ నిర్వహణ కోసం అవసరమైన ఏర్పాట్లలో ప్రజలు నిమగ్నమయ్యారు. వరలక్ష్మీదేవి ఆరాధన కోసం అవసరమైన పూలు, పండ్లు, అరటి పిలకలు, మామిడాకులు, తమలపాకులు, టెంకాయలు, కర్పూరం, గంధం, కడ్డీలు తదితర పూజా సామగ్రి దుకాణాలు మహిళలతో రద్దీగా మారాయి. ముఖ్యంగా కడప నగరంలోని పాత బస్టాండు, గర్ల్స్ జూనియర్ కళాశాల, వన్‌టౌన్ సర్కిల్, బీకేఎం స్ట్రీట్, ఆర్టీసీ బస్టాండు, కాగితాలపెంట, దొంగలచెరువుకట్ట, అప్సర సర్కిల్ తదితర ప్రాంతాలు జనంతో కిటకిటలాడాయి. పండుగ కావడంతో పూజా సామాగ్రికి అవసరమైన వస్తువుల ధరలు కూడా వ్యాపారులు అమాంతం పెంచేశారు. కనకాంబరాలు పావు రూ.100, మల్లె, జాజి పూలు పావు రూ.80, చెండుమల్లె కిలో రూ.150, చేమంతి, రోజా పూలు కిలో రూ. 400 చొప్పున విక్రయించారు. అరటి పిలక రూ.30, అరటి పండ్లు డజన్ రూ. 60, మామిడి ఆకులు రూ.30 చొప్పున విక్రయించారు. తాము నందలూరు, రాజంపేట వంటి దూర ప్రాంతాల నుంచి అరటి పిలకలను తీసుకొచ్చి విక్రయిస్తున్నామని, కనీసం రూ. 50 ఉంటేనే గిట్టుబాటు అవుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

వరలక్ష్మీ వ్రతానికి ఏర్పాట్లు
బ్రాహ్మణులు, వేద పండితుల ఆధ్వర్యంలో వరలక్ష్మీవ్రతం కోసం అమ్మవారి కలశ ప్రతిష్ఠ చేసేందుకు భక్తులు సన్నాహాలు ప్రారంభించారు. మరి కొన్నిచోట్ల సామూహిక వ్రతాల కోసం ఏర్పాట్లు చేసుకున్నారు. శ్రావణమాసంలో వచ్చే ఈ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తే అమ్మవారు కరుణించి కోరిన వరాలిస్తారని, సౌభాగ్యం అందజేస్తారని భక్తుల విశ్వాసం. కడప నగరంలో శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఉదయం నిర్వాహకులు భక్తులచే సామూహికంగా అమ్మవారి వ్రతం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి విశేష ఆదరణ

- ఎన్నికల ప్రచారంలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి
- ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్‌రెడ్డి, తదితరులు



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్‌రెడ్డి

పులివెందుల/వేంపల్లి: గ్రామీణ ప్రాంత ప్రజల నుంచి వైఎస్సార్‌సీపీకి విశేష ఆదరణ లభిస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పులివెందుల మండలంలోని నల్లపురెడ్డి పల్లె, తండా, మల్లికార్జునపురం (దళితవాడ), ఎర్రబల్లె గ్రామాల్లో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, పులివెందుల మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డిలతో కలిసి ఎంపీ అవినాష్ రెడ్డి జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆ గ్రామంలోని శివాలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జెడ్పీటీసీ ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తుమ్మల హేమంత్ రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు.

కూటమి కుట్రలను ఓటుతో తిప్పికొడదాం
ఈ సందర్భంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి నేతల కుట్రలు, కుతంత్రాలను ఓటుతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కరువుతో అల్లాడుతున్న రైతులకు కృష్ణా జలాలను తీసుకొచ్చి వ్యవసాయాన్ని పండగలా చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం సాధారణ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరచకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలలో ఒకట్రెండు అమలు చేసి అన్ని ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటోందన్నారు. ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీలకు 50ఏళ్లకుపైబడిన వారికి పెన్షన్ పథకం అమలు చేస్తామని చెప్పి తుంగలో తొక్కిందన్నారు. జెడ్పీటీసీ ఎన్నికలు సజావుగా నిర్వహిస్తే ఓడిపోతామని తెలిసి వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను బైండోవర్ పేరుతో పోలీసులు అక్రమ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. మూడు రోజులుగా వైఎస్సార్‌సీపీ నాయకులను ప్రచారం చేయనీయకుండా పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆ గ్రామంలో టీడీపీ, కూటమి నేతలు ఉన్నారని వైఎస్సార్‌సీపీ నాయకులను అక్కడికి ప్రచారానికి వెళ్లకూడదని ఆంక్షలు విధిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి, మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కడప క్రీడా అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు భరత్ రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొడదుప్పి మృతి



కుక్కల బారిన పడి మృతి చెందిన పొడదుప్పి

అట్లూరు : కుక్కల బారిన పడి పొడదుప్పి మృతిచెందిన సంఘటన అట్లూరు మండలం ఎస్ వెంకటాపురం కాలనీలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. లంక మల్లేశ్వర అభయారణ్యం నుంచి ఎస్.వెంకటాపురం కాలనీ లోకి గురువారం ఉదయం ఓ పొడదుప్పి వచ్చింది. కుక్కలు దాడి చేస్తుండగా స్థానికులు గమనించి తప్పించారు. అటవీశాఖ సెక్షన్ ఆఫీషర్ సురేష్‌కు సమాచారం అందించగా ఆయన వచ్చేలోపే పొడదుప్పి మృతిచెందింది. స్థానిక పశువైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం ఖననం చేసినట్లు సెక్షన్ ఆఫీషర్ సురేష్ తెలిపారు.

గది అద్దెకిస్తే.. నగదు, నగలు అపహరణ

లింగాల : గది అద్దెకిస్తే.. నమ్మించి..నగదు, నగలు అపహరించిన సంఘటన లింగాల మండలం పార్నపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లాకు చెందిన హసీనా, మాబాషా ప్రేమించుకుని వివాహం చేసుకున్నారు. తమకు ఆశ్రయం కల్పించాలని పార్నపల్లి గ్రామానికి వచ్చారు. ఆ యువతీ యువకులు అరటి కాయలు మోసే కూలిపనులు చేస్తూ గత ఆరు మాసాలుగా జీవనం సాగిస్తున్నారు. వారికి ఇల్లు అద్దెక్కించిన మహిళ ఇంట్లో లేనిది చూసి గురువారం ఆమె ఇంటి తాళాలు పగులగొట్టారు. ఇంట్లో దాచిన రూ.1.10లక్షల నగదు, జత బంగారు కమ్మలు, మాటీలు, కాళ్ల గొలుసులు అపహరించి పారిపోయారు. ఈ విషయమై ఇల్లు అద్దెకు ఇప్పించిన వ్యక్తితోపాటు పారిపోయిన హసీనా, మాబాషాలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఇల్లూరులో మహిళపై దాడి

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మండలం ఇల్లూరు గ్రామంలో నివాసముంటున్న లక్ష్మీదేవిపై అదే గ్రామానికి చెందిన నరేంద్ర దాడి చేశాడు. కలమల్ల ఎస్ఐ సునీల్‌కుమార్ వివరాల మేరకు.. వినాయకచవితిని పురస్కరించుకుని ఇల్లూరు గ్రామంలో చందా వసూలు చేస్తున్నారు. గ్రామానికి చెందిన నరేంద్ర లక్ష్మీదేవి ఇంటికి వెళ్లి చందా ఇవ్వాలని కోరాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. మాటా మాటా పెరిగి నరేంద్ర కర్ర తీసుకుని లక్ష్మీదేవిపై దాడి చేశాడు. బలమైన దెబ్బలు తగలడంతో ఆమెను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బాధితురాలిని పరామర్శించారు.

యువకుడు ఆత్మహత్య


జమ్మలమడుగు రూరల్ : విషద్రావణం తీసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. ఎస్ఐ రామక్రిష్ణ వివరాల మేరకు.. మోరగుడి గ్రామానికి చెందిన చాకలి జగన్ (33) మద్యానికి బానిసయ్యారు. కుటుంబ సమస్యలతో ఈ నెల 4న విషద్రావణం తీసుకోని ఆత్మహత్యాయత్నం చేశాడు. పరిస్థితి విషమించడంతో కర్నూలు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. భార్య విజయలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

దేవగుడిలో వివాహిత...

మండలంలోని దేవగుడి గ్రామానికి చెందిన వివాహిత రేవతి దేవి(40) అనే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రేవతి దేవి గత కొంత కాలంగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది గురువారం ఫ్యాన్‌కు ఉరివేసుకోని అత్మహత్య చేసుకుంది. భర్త బాబు ఖాజీపేటలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నాడు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలకు వేళాయె..!

- ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు పరీక్షలు
- డీసీఈబీ నుంచి మండల కేంద్రాలకు చేరుకున్న ప్రశ్న పత్రాలు





ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



డీసీఈబీ నుంచి ఆటోలో తరలిస్తున్న ప్రశ్న పత్రాలు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేసేందుకు విద్యా శాఖ ఏటా ఫార్మెటివ్, సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను నిర్వహిస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో నాలుగు సెల్ఫ్ అసెస్‌మెంట్, రెండు సమ్మెటివ్ పరీక్షలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో తొలి అసెస్‌మెంట్ మోడల్ పేపర్–1ను ఈ నెల 11వతేదీ నుంచి క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్‌ను విధానంలో నిర్వహించనున్నారు. గత విద్యా సంవత్సరం వరకూ 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు సీబీఏ విధానం అమలుచేయగా ఈ ఏడాది ఆ విధానాన్ని 9వ తరగతి వరకూ పొడిగించారు. కేవలం పదో తరగతి విద్యార్థులకు మాత్రమే ఫార్మేటివ్ పరీక్షలను జరపనున్నారు.

జిల్లాలో విద్యార్థుల వివరాలిలా...

జిల్లాలో 1912 ప్రభుత్వ, ఎయిడెడ్, జెడ్పీ, మున్సిపల్ యాజమాన్యాల్లో ప్రాథమిక పాఠశాలలు ఉండగా ఇందులో 96382 మంది విద్యార్థులున్నారు. 273 యూపీ స్కూల్స్‌లో 33226, 634 హైస్కూల్స్‌లో 165350 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 2819 పాఠశాలల్లో 2,94,958 మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు.

పరీక్షల షెడ్యూల్ ఇదీ...

ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పరీక్ష నిర్వహిస్తారు. 11వ తేదీన ఉదయం 9.30 నుంచి 10.45 వరకూ తెలుగు/ఉర్దూ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆదే రోజు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి 2.30 గంటల వరకు మ్యాథ్‌మాటిక్స్, 12న ఉదయం ఆంగ్లం, మధ్యాహ్నం ఎన్విరాల్‌మెంట్ సైన్సు పరీక్ష ఉంటాయి. 13న ఉదయం ఓఎస్ఎస్‌సీ పరీక్ష 3, 4, 5వ తరగతుల విద్యార్థులకు మాత్రమే ఉంటుంది.

6,7,8 తరగతులకు సంబంధించి...

ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7, 8వ తరగతుల విద్యార్థులకు 11న ఉదయం 9.30 గంటల నుంచి 10.45 వరకు తెలుగు/ఉర్దూ/కాంజోజిట్ తెలుగు పరీక్ష, మధ్యాహ్నం 1.15 నుంచి 2.30 గంటలకు మ్యాథమాటిక్స్ పరీక్ష ఉంటాయి. 12న హిందీ/స్పెషల్ తెలుగు పరీక్ష, మధ్యాహ్నం జనరల్ సైన్సు/ఫిజికల్ సైన్సు పరీక్ష, 13న ఉదయం ఆంగ్లం, మధ్యాహ్నం సోసియల్ స్టడీస్ పరీక్ష, 14న 6,7వ తరగతులకు ఏఎస్ఎస్‌సీ పరీక్ష నిర్వహించనున్నారు.

9,10 తరగతులకు సంబంధించి...

హైస్కూల్స్‌లో 9, 10వ తరగతులకు 11న ఉదయం 11 గంటల నుంచి 12.15 వరకు తెలుగు/ఉర్దూ/కాంపోజిట్ తెలుగు పరీక్ష, మధ్యాహ్నం 2.45 గంటల నుంచి 4 గంటల వరకు మ్యాథ్స్ పరీక్ష నిర్వహించనున్నారు. 12న ఉదయం హిందీ/స్పెషల్ తెలుగు, మధ్యాహ్నం ఫిజికల్ సైన్సు, 13న ఉదయం ఆంగ్లం, మధ్యాహ్నం సోసియల్ స్టడీస్ పరీక్ష ఉంటాయి. 13న ఉదయం 9.30 నుంచి 10.45 వరకు 8, 9, 10వ తరగతులకు బయోలాజికల్ సైన్సు, ఉదయం 11 గంటల నుంచి 12.45 వరకు ఓఎస్ఎస్‌సీ –1, మధ్యాహ్నం 2.45 నుంచి 4 గంటల వరకు ఓఎస్ఎస్‌సి–2 పరీక్ష నిర్వహించనున్నారు.

బైలింగ్విల్‌లో ప్రశ్నాపత్రం...

సిబిఏ విధానంలో నిర్వహిస్తున్న పరీక్షలకు పశ్నాపత్రం బైలింగ్విల్ విధానంలో ఉంటుంది. విద్యార్థికి ఆంగ్లం అర్థకాకుంటే తెలుగులో చదవి అర్థం చేసుకునే విధానం 2023–24 నుంచి ప్రవేశపెట్టారు. ప్రశ్నపత్రంలో పది ప్రశ్నలు అబ్జెక్టివ్ విధానంలో, మరో ఐదు ప్రశ్నలు రాత పూర్వక విధానంలో ఇవ్వనున్నారు. మొత్తం 15 ప్రశ్నలకు 20 మార్కులు కేటాయిస్తారు. ఓఎంఆర్ పత్రాల్లో జవాబు నింపి జిల్లాకు పంపాల్సి ఉంటుంది. సీబీటీ విధానంలో పరీక్షలు రాసే విద్యార్థులు ప్రశ్నలకు సమాధానాలను ఓఎంఆర్ షీట్లో నింపాల్సి ఉంటుంది.

ఎమ్మార్సీ కేంద్రాలకు...ప్రశ్న పత్రాలు



సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్ –1 పరీక్షలకు సంబంధించిన పశ్న పత్రాలు, ఓఎంఆర్ షీట్లను జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలలోని ఎమ్మార్సీలకు తరలించాం. పరీక్ష పత్రాలకు ఎంఈఓలు కష్టోడియన్లుగా వ్యవహరిస్తారు. పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని మార్గదర్శకాలు ఎంఈఓలు, హెచ్ఎంలకు జారీ చేశాం.

– విజయభాస్కర్‌రెడ్డి, సెక్రటరీ, డీసీఈబీ, కడప

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



ఎస్ఏఎంపీ–1 పరీక్షలను ప్రధానోపాధ్యాయుడు పకడ్బందీగా నిర్వహించాలి. ఏ రోజు పరీక్షకు ఆ రోజే ప్రశ్న పత్రాన్ని తీసుకెళ్లి పరీక్ష నిర్వహించాలి. పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఆరోపణలకు తావులేకుండా హెచ్ఎంలు అన్ని జాగ్రత్తలు తీసుకుని నిర్వహించాలి. పరీక్ష పేపర్లు లీకైతే సంబధితులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి

శిక్షణ ఫలాలు సఫలీకృతం కావాలి



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానందరాజు

కడప ఎడ్యుకేషన్ : కేజీబీవీలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇచ్చిన శిక్షణ సఫలీకృతమయ్యే విధంగా చూడాలని జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యనందరాజు సూచించారు. కడప నగర శివారులోని గ్లోబర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ వివిధ ఫిజిక్స్, కెమిస్ట్రీ అధ్యాపకులకు ఇచ్చిన శిక్షణ గురువారం ముగిసింది. ఏపీసీ నిత్యానందరాజు మాట్లాడుతూ జీసీడీవో దార్ల రూత్ ఆరోగ్యమేరీ ఆధ్వర్యంలో కడప, కర్నూల్, చిత్తూరు, అనంతపురం, సత్యసాయి, తిరుపతి, చిత్తూరు, నంద్యాల, నెల్లూరు జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారన్నారు. బీడు, చౌడు భూముల్లో సేద్యం చేసి పంటలు పండించడం ఎంతకష్టమో. వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడం అంతే కష్టమన్నారు. శిక్షణ తరగతుల్లో 21 మంది రిసోర్సు పర్సన్స్ పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో వీరేంద్రరావు, ఏఎస్ఓ సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

కడప కార్పొరేషన్ : నిత్యం ప్రజాసేవలో ఉండే జర్నలిస్టులపై కడప పోలీసు శాఖ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని కడప జిల్లా ఏపీయూడబ్ల్యుజే శాఖ స్పష్టం చేసింది. నల్లగొండువారిపల్లె ఘటనపై డీఐజీ వివరణను వక్రీకరించి వక్రబుద్ధితో, ఒక పార్టీకి వత్తాసు పలికేలా రాశారంటూ జర్నలిస్టుల ఆత్మ గౌరవాన్ని కించపరచడం సరికాదని యూనియన్ నేతలు ఆరోపించారు. పోలీసులు ప్రెస్‌మీట్‌లోని వ్యాఖ్యలను ఎవరూ వక్రీకరించలేదని, డీఐజీ కోయప్రవీణ్ మాట్లాడిన మాటలనే యదాతథంగా ప్రసారం చేశారన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న అధికారి ఎవరూ కూడా పరుషపద జాలం ఉపయోగించడం ఏమాత్రం వాంఛనీయం కాదన్నారు. అదే అంశాన్ని మీడియాలో యధాతథంగా ప్రసారం చేయడం ఏ విధంగా తప్పవుతుందని ప్రశ్నించారు. మీడియా తన బాధ్యత నిర్వర్తించిందని, దానికి రాజకీయ పార్టీల పేరుతో జర్నలిస్టులను అంటగట్టడం సరికాదన్నారు. పోలీసు శాఖ విడుదల చేసిన ప్రెస్‌నోట్ సదరు జర్నలిస్టులకు ఇచ్చిన నోటీసుల్లో వాడిన పదజాలం ఆక్షేపణీయమన్నారు. విద్వేషాలను రెచ్చగొట్టి శాంత భద్రతల సమస్య ఉత్పన్నమయ్యేలా టీవీ ప్రసారాలు ఉన్నాయంటూ అభాండాలు మోపడం తగదన్నారు. డీఐజీ కోయ ప్రవీణ్ వ్యాఖ్యలను వక్రీకరించడం మీడియా పని కాదన్నారు. ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర నాయకుడు పి. రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎం.బాలక్రిష్ణారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకటరెడ్డి ప్రకటన విడుదల చేశారు.

బాలిక ఆత్మహత్య

కడప అర్బన్ : కడప రిమ్స్ పీఎస్ పరిధిలోని ఫరీదా నగర్‌కు చెందిన ఉప్పర హరీష(17) బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఉప్పర హరీష(17) పదో తరగతి వరకూ చదువుకొని ఇంటి వద్ద ఉంటోంది. ఇంటర్ చదవాలని కోరుకునేదని.. తల్లిదండ్రులకు చెప్తే ఒప్పుకుంటారో లేదోనని తీవ్ర మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం తల్లిదండ్రులు లక్ష్మీదేవి, పెద్దయ్య ఇంటికి వచ్చి చూసేసరికి ఉరేసుకుని వేలాడడం చూసి వెంటనే ఆటోలో రిమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందడంతో మార్చురీకి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలియజేశారు.

ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల ఏర్పాటు



పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్

పులివెందుల : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికకు సంబంధించి 11 మంది ప్రధాన పార్టీ అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్లు పోటీలో ఉన్నారని పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. ఎన్నిక సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లపై చర్చించి అంతర్ జిల్లాల సరిహద్దులలో చెక్ పోస్టులను ఏర్పాటుచేశామన్నారు. పార్టీ నాయకులు ప్రచారానికి ముందస్తుగా సమాచారం ఇస్తే భద్రత కల్పించామన్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వకుండా నల్లగొండువారిపల్లెకు వెళ్లి అక్కడ ప్రచారంలో టీడీపీకి చెందిన గూటూరు ధనుంజయపై వేల్పుల రామలింగారెడ్డి, హేమాద్రిరెడ్డి, మరింతమంది కులం పేరుతో దూషించి మారణాయుధాలతో దాడి చేశారన్నారు. పరస్పర దాడులు జరుపుకోవడంతో మారెడ్డి జయవర్ధన్‌రెడ్డి, చప్పిడి శ్రీనాథరెడ్డి, కిరికిరీ బాషా, అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి, పేర్ల కళ్యాణ్‌రెడ్డి, పేర్ల సత్యనారాయణరెడ్డి, పేర్ల శేషారెడ్డి, ధనుంజయరెడ్డిలతోపాటు కొంతమంది కంప్లయింట్ ఇచ్చారని, హత్యాయత్నం కింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ధనుంజయ తనను కులం పేరు దూషించినట్లు కంప్లయింట్ ఇవ్వడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎన్నికల నియమావళి, నిబంధనలకు విరుద్ధంగా అనుమతి తీసుకోకుండా పోలీసుల రాకపోకలకు అంతరాయం కలిగించడంపై ఎంపీడీఓ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, బయపురెడ్డి, ఎంపీపీఏ రాఘవరెడ్డిలతోపాటు 150మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులతోపాటు కోరా విశ్వనాథరెడ్డి ఫోన్లలో నీ అంతు చూస్తామని బెదిరించినట్లు ఫిర్యాదు రావడంతో వైఎస్.భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఎంపీ పీఏ రాఘవరెడ్డి, తుమ్మల గంగాధరెడ్డిలపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. త్వరగా ఇన్వెస్టిగేషన్ చేసిన బాధ్యులైన వారిని అరెస్టు చేయడం జరుగుతుందన్నారు.

చోరీకి యత్నం.. దొంగకు దేహశుద్ధి



గాయాల పాలైన రైతు వెంకటసుబ్బయ్య



దుండగుడిని పట్టుకున్న గ్రామస్తులు

రాజుపాళెం : పట్ట పగలే రహదారి పక్కనే ఉన్న ఇంట్లో ఓ దొంగ చోరీకి యత్నించగా.. గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన రాజుపాళెం మండలం టంగుటూరులో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు. కానగూడూరు ప్రధాన రహదారిలోని ఉంటున్న రైతు నంద్యాల వెంకట సుబ్బయ్య గ్రామానికి దూరంగా ఉన్న సచివాలయం వద్ద పని నిమిత్తం వెళ్లారు. తిరిగి ఇంటికి చేరుకోగా అప్పటికే ఇంటి తలుపులు మూసివేసి దుండగుడు ఇంట్లో ఉన్న ఇనుప బీరువా పగలగొట్టే పనిలో కనిపించారు. రైతు వెంకటసుబ్బయ్యను చూసి దుండగుడు ఇనుప రాడ్డుతో దాడికి పాల్పడ్డాడు. రైతు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారంతా వచ్చి దుండగుడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తీవ్రగాయాలైన వెంకట సుబ్బయ్యను ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాల మద్దిలేటి, ఎస్ఐ వెంకటరమణ పరిశీలించారు. చోరీకి పాల్పడిన దుండగుడు దువ్వూరు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి, షేక్ మహమ్మద్ రఫీగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో విచారణ

ప్రొద్దుటూరు కల్చరల్ : వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి దేవస్థానంపై వచ్చిన ఫిర్యాదు మేరకు దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ గురువారం ఆలయంలో విచారణ జరిపారు. ఆలయంలో అక్రమాలు జరిగాయంటూ తెల్లాకుల మనోహర్ దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం డిప్యూటీ కమిషనర్ ఆలయానికి వచ్చి ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావును విచారించారు. దసరా పండగ తర్వాత వివరాలను అందిస్తామని ఆయన చెప్పగా.. నెల రోజులులోపు పూర్తి వివరాలు అందించాలని డీసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ దరఖాస్తులకు గడువు పొడగింపు

కడప ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఆగష్టు 13వతేదీ వరకూ గడువు పొడగించినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. 2025–26 సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్కూటీ డిక్కీలో నగదు మాయం

– చాకచక్యంగా రూ.3.95 లక్షలు కొట్టేసిన దొంగ

ప్రొద్దుటూరు క్రైం : స్కూటీలో డిక్కీలో రూ.3.95 లక్షల నోట్ల కట్టలను ఓ దొంగ చాకచక్యంగా కొట్టేశాడు. ఇంటికెళ్లి డిక్కీ తెరవగా డబ్బు కనిపించకపోవడంతో బాధితులు లబోదిబోమన్నారు. పోలీసుల వివరాల మేరకు.. ప్రొద్దుటూరు హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్న కల్లూరు రమణారెడ్డి రాజుపాలెం మండలంలోని టంగుటూరు ఎంపీపీ స్కూల్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య సబితారెడ్డి అన్నమయ్య జిల్లాలో టీచర్‌గా పని చేస్తోంది. ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీలోని తన సొంత స్థలాన్ని ఈ నెల 5న కడపకు చెందిన మల్లేశ్వరికి రూ.4,95,500లకు విక్రయించాడు. ఆ మొత్తాన్ని రమణారెడ్డి బ్యాంక్ అకౌంట్‌లో వేసింది. బుధవారం గాంధీ రోడ్డులోని ఇండియన్ బ్యాంక్‌కు వెళ్లి ఆ డబ్బు రమణారెడ్డి డ్రా చేసుకున్నాడు. నోట్ల కట్టలను స్కూటీ డిక్కీలో పెట్టుకొని నేరుగా కొర్రపాడు రోడ్డులోని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాడు. స్కూటీ కార్యాలయం ఎదుట పార్క్ చేసి స్థలం అమ్మిన పత్రాల్లో సంతకాలు పెట్టాడు. తిరిగి స్కూటీలో ఇంటికి వెళ్లి చేసుకోగా డిక్కీలోని నోట్ల కట్టల్లో రూ. 3.95,500 కనిపించలేదు. డిక్కీలో నగదు కాజేసి చాకచక్యంగా మళ్లీ డిక్కీ మూసివేశారని గుర్తించి అతను టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి కోసం సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

వేతనంతో కూడిన సెలవు దినం

కడప కోటిరెడ్డి సర్కిల్ : వైఎస్సార్ జిల్లాలో జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా ఈ నెల 12దీన దుకాణాలు, సంస్థలలోని ఉద్యోగులు, కార్మికులకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని వైఎస్సార్ కడప జిల్లా ఉప కార్మిక కమిషనర్ డి.వి.రంగరాజు తెలిపారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీలకు ఈ నెల 1న మంగళవారం పోలింగ్ నిర్వహిస్తున్నందున ఓటు హక్కు వినియోగించుకోవడానికి కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రత్యేక శ్రద్ధతో అమలుచేయాలి

కడప అర్బన్: జిల్లాలో పీ–4 విధానాన్ని అధికారులు ప్రత్యేక శ్రద్ధతో అమలుచేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. పీ–4పై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కావేటి విజయానంద్ వీసీ ద్వారా గురువారం సమీక్షించారు. వీసీ అనంతరం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా అధికారులతో మాట్లాడుతూ కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జిల్లాలో గ్రామసభల ద్వారా నిర్వహిస్తున్న అసెస్‌మెంట్ సర్వే త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. డాక్యుమెంట్స్ అప్‌లోడ్ కార్యక్రమం పెండింగ్ లేకుండా చూడాలన్నారు. అర్హులైన ప్రతి రైతు ఖాతాలో అన్నదాత సుఖీభవ పథకం కింద నగదు జమ అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం

చాపాడు: మండలంలోని మైదుకూరు– ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని పల్లవోలు గ్రామం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబవరం శివ(31) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, మృతుడి బంధువుల వివరాల మేరకు.. జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామానికి చెందిన అంబవరం శివ ట్రాక్టర్‌లో రాళ్లలోడుతో అన్నమయ్య జిల్లా రాయచోటికి వెళుతున్నాడు. చాపాడు మండలం పల్లవోలు గ్రామం వద్ద ప్రమాదశాత్తూ శివ క్రింద పడిపోయాడు. రోడ్డు ప్రక్కనే డివైడర్‌కు తల తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. మృతుడు శివకు భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



మృతుడు ఈశ్వర్‌రెడ్డి

చిన్నమండెం : మండలంలోని కలిబండ గ్రామం కొల్లవాండ్లపల్లెకు చెందిన రైతు ఈశ్వర్‌రెడ్డి(38) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. గత కొద్ది రోజులుగా ఈశ్వర్‌రెడ్డి విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతుండేవాడని తెలిపారు. ఈ క్రమంలోనే నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు

- అర కిలో బంగారం, పది కిలోల వెండి ఆభరణాలు, బైక్ స్వాధీనం
- నాటు తుపాకీ, బొలెరో వాహనం, ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్



పట్టుకున్న దొంగల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు కరడుగట్టిన దొంగలను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.60 లక్షల విలువ చేసే అర కిలో బంగారం, రూ.10 లక్షల విలువ చేసే పది కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. విలేకరులతో వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ ఈజీ. అశోక్‌కుమార్ నిందితుల వివరాలను గురువారం వెల్లడించారు. కడప జిల్లా బద్వేల్ టౌన్ పరిధిలోని చెన్నంపట్టిమిట్ట వద్ద నివాసముంటున్న గుమ్మళ్ల వెంకటసుబ్బయ్య, గౌరీశంకర్‌నగర్‌కు చెందిన నూతి వెంకటసుబ్బయ్య గత రెండేళ్లగా తాళం వేసిన ఇళ్ల పగలు గుర్తించడం, రాత్రి చోరీలకు పాల్పడడం అలవాటు చేసుకున్నారు. వీరు ఎర్రచందనం అక్రమ రవాణా చేయడమేగాక, కడప, నెల్లూరు జిల్లాలో తాళం వేసిన ఇళ్ల తలుపులు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. అయితే ఇళ్ల చోరీలో తక్కువ మొత్తంలో బంగారు ఆభరణాలు లభించడంతో సంతృప్తి చెందక, ఎక్కువ మొత్తంలో ఆభరణాలు దోచుకోవాలని ప్రయత్నం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలోనే కడప, అన్నమయ్య, సత్యసాయి, నెల్లూరు, కాకినాడ జిల్లాల్లోని బంగారు దుకాణాలకు తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. గుంటూరులో బైక్ చోరీ చేశారు. ఈ ప్రయత్నంలోనే గతంలోనూ అరెస్టయి జైలుకు వెళ్లాడని పోలీసుల విచారణలో తేలింది. తీరికసమయాల్లో పేకాడడం, సహచరులతో లంకమల అడవికి వెళ్లి నాటు తుపాకీతో వన్యప్రాణులను వేటాడడం చేశారు. గుమ్మళ్ల వెంకటసుబ్బయ్యపై గతంలో 28 వరకూ ఎర్ర చందనం అక్రమ రవాణా, 38 చోరీ కేసులు నమోదయ్యాయి. ఇతడిపై పీడీ యాక్ట్ ఉండడమేగాక, జైలు శిక్ష అనుభవించి బయటికి వచ్చాడు.

చోరీలు పెరగడంతో పోలీసుల నిఘా

జిల్లాలోని పోరుమామిళ్ల, బి.కోడూర్, మైదుకూర్, బద్వేల్ టౌన్, కలసపాడు, ఖాజీపేట, కాశినాయన, దువ్వూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళం వేసిన ఇళ్లపై పగలు రెక్కీ చేసి, రాత్రి సమయాలలో బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీలు ఇటీవల పెరిగాయి. దాదాపు 12 ఇళ్లు, బంగారు దుకాణంలోనూ ఈ చోరీలు జరగడంతో ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్ సీరియస్‌గా తీసుకున్నారు.

ప్రత్యేక బృందాలు ఏర్పాటు

మైదుకూర్ డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో బద్వేల్ రూరల్ సీఐ ఎం.నాగభూషణ్, మైదుకూరు యూసీపీఎస్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, బద్వేల్ రూరల్ ఎస్ఐ కె.శ్రీకాంత్, సిబ్బందిని ప్రత్యేక బృందంగా నియమించి నిఘా పెంచారు. గోపవరం మండలం పీపీకుంట సమీపంలోని చెలిమికుంట అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలు నరికి కర్ణాటకలోని కటికనహళ్లికి అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారం తెలియడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే గుమ్మళ్ల వెంకటసుబ్బయ్య, నూతి వెంకటసుబ్బయ్య ఎర్రచందనం రవాణా చేసూ్తూ పట్టుబడ్డారు. వారి నుంచి బొలెరో వాహనం, నాలుగు ఎర్రచందనం దుంగలు, నాటు తుపాకీ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని విచారించగా గత నేరచరిత్ర కలిగిన వ్యక్తులని గుర్తించారు. అనంతరం పలు చోట్ల చోరీలకు పాల్పడినట్లు తెలియడంతో అరెస్టు చేశారు.

పోలీసులకు ఎస్పీ ప్రశంస

మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న గుమ్మళ్ల వెంకటసుబ్బయ్య, నూతి వెంకటసుబ్బయ్యలను అత్యంత చాకచక్యంగా అరెస్టు చేసి, చోరీ సొత్తు, ఎర్రచందనం దుంగలు, నాటు తుపాకీ రికవరీ చేసిన మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్, బద్వేల్ రూరల్ సీఐ ఎ.నాగభూషణ్, ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, ఎస్ఐలు కె.శ్రీకాంత్, చిరంజీవి, శివప్రసాద్, తదితర సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.